


# డిటెక్టివ్ కథలు

## ఎడ్గార్ ఆలన్ పో

# పోయిన ఉత్తరం

## దాదాహయాత్

పారిస్
18వ సంవత్సరం.
ఆకురాలే కాలం.

ఓ సాయంత్రం బాగా పెనుగాలులు వీచాక అప్పుడే చీకటిపడింది. ఫొబోర్గ్ సెయింట్ జర్మన్ వీధిలో 33వ నెంబరు ఇంటి వెనుక భాగమిది. అక్కడ నా మిత్రుడు సి. ఆగస్టె డ్యూపిన్‌తో కలిసి సరిగ్గా పుస్తకాల బీరువా అంతే వున్న అతని లైబ్రరీ గదిలో తపస్సు మాదిరిలో కూచుని పైపు పీలుస్తూ బ్రహ్మానందం అనుభవిస్తున్నాను.

అప్పటికి కనీసం గంట సేపట్నుంచి మేము గాఢమైన నిశ్శబ్దం పాటిస్తున్నాం. ఆ సమయంలో ఎవరైనా మమ్మల్ని చూస్తే గాల్లో గుండ్రాలు వదుల్తూ అదే పనిగా ఆ గదిని పొగతో నింపేయడం తప్ప మరింకే శుభకార్యం చేయడం లేదనుకుంటారు. అయితే నేను మాత్రం ఆ సాయంత్రం మా ఇద్దరి మధ్యా జరిగిన సంభాషణ గురించే ఆలోచిస్తున్నాను.. రూమార్గ్ వ్యవహారానికీ, మేరీ రోజే హత్యా రహస్యానికీ సంబంధించి సాగిన సంభాషణ అది. అలా నేను ఆలోచించుకుంటూ వుండగా ఆ గది తలుపు తెరుచుకుని మా ఓల్డు ఫ్రెండు పారిస్ నగర పోలీసు ఉన్నతాధికారి మిస్టర్ జీ లోనికి రావడం కేవలం కాకతాళీయమనే అనిపించింది నాకు.

ఆ మనిషి ఎంత కుళ్ళుబోతో అంత తమాషాగా కూడా వుంటాడు. తనని చూసి ఏళ్ళు గడిచిపోవడంతో మేము హృదయపూర్వకంగా స్వాగతం పలికాం. అంతవరకూ మేము చీకట్లో కూర్చొని వుండడం వల్ల దీపం వెలిగించడానికి డ్యూపిన్ లేచాడు. అయితే తనని పీడిస్తున్న ఏదో సమస్య గురించి డ్యూపిన్‌ని సంప్రదించడానికి వచ్చానని మిస్టర్ జీ చెప్పడంతో అంతలోకే మళ్ళీ కూర్చుండిపోయాడు.

"అదేదో ఆలోచించాల్సిన విషయమే అయితే చీకట్లో కూచుని ఆలోచించడమే బెటరు" అన్నాడు డ్యూపిన్.

"మీకున్న విచిత్రమైన అలవాట్లలో అదొకటి" చెప్పాడు జీ. తనకు అర్థంకాని విషయాలన్నీ ఆయన గారికి విచిత్రంగానే కనిపిస్తాయి. అందుకే పాపం తనీ లోకంలో బోలెడు వింతలమధ్య బతికేస్తున్నాడు.

"నిజం చెప్పారు" అంటూ డ్యూపిన్ తనకో పైపు అందించి కుర్చీ ఒకటి దగ్గరికి లాగాడు.

"ఇంతకీ ఇప్పుడేం ముంచుకొచ్చింది? కొంపదీసి హత్యకాదుగదా?" ఆరా తీశాను.

"అబ్బే, అలాంటిదేం లేదు. చాలా సింపుల్ విషయమే అనుకోండి. మా అంతట మేమే పరిష్కరించుకోగలం. అయినా డ్యూపిన్ కూడా ఓసారి ఆ వివరాలు వింటే బావుంటుందని ఇలా వచ్చాను. ఎందుకంటే ఈ వ్యవహారమంతా మహా విచిత్రంగా అనిపిస్తోంది నాకు."

"ఓ వైపు సింపుల్ విషయమని చెబుతూనే మరోవైపు విచిత్రమైన వ్యవహారమంటున్నారు" అన్నాడు డ్యూపిన్.

"అవును. నిజానికది కూడా కాదు. అసలు సంగతేమిటంటే అంత సింపుల్ వ్యవహారం మమ్మల్నింతగా తికమక పెట్టడమే వింతగా వుంది."

"వ్యవహారం మరీ సింపుల్ కావడం వల్లనే మీరు పప్పులో కాలేశారేమో" అన్నాడు డ్యూపిన్.

"వాట్ నాన్సెన్స్ యూ డూ టాక్" గట్టిగా నవ్వుతూ అన్నాడు జీ.

"బొత్తిగా సాదా మిస్టరీలా వుంది" అన్నాడు డ్యూపిన్.

"గుడ్ హెవెన్స్! అలాగని ఎవరన్నారండీ?"

"సులభంగా తేలిపోయే రహస్యమనుకుంటాను."

మిస్టర్ జీకి ఆ మాట చాలా హాస్యాస్పదంగా తోచింది. "నన్ను నవ్వించి చంపొద్దు డ్యూపిన్!" అన్నాడు పగలబడి నవ్వుతూ.

"ఇంతకీ అసలు సంగతేమిటి?" అడిగాన్నేను.

"చెప్తాను" గట్టిగా ఓ దమ్ము బిగించి కొట్టి కుర్చీలో సర్దుకుంటూ అన్నాడు జీ. "క్లుప్తంగా చెప్తాను. అయితే చెప్పడానికి ముందు మిమ్మల్నోసారి హెచ్చరించాలి. చాలా రహస్యంగా వుంచాల్సిన విషయమిది. ఇదెవరికైనా నేను చెప్పానన్న సంగతి బయటికొచ్చిందంటే చాలు, నా వుద్యోగం కాస్తా వూడిపోతుంది."

"ప్రొసీడ్" అన్నాను.


"వద్దనుకుంటే చెప్పొద్దు" అన్నాడు డ్యూపిన్.

"వెల్, చాలా ముఖ్యమైన పత్రం ఒకటి రాజభవనం నుంచి పోయిందని నాకు పర్సనల్‌గా పైనుంచి సమాచారం అందింది. దొంగ ఎవరో కూడా తెలుసు. అందులో ఎలాంటి సందేహం అవసరం లేదు. దొంగతనం చేస్తుండగా అతన్ని చూసిన వాళ్ళున్నారు. ఆ పత్రం ఇంకా అతని ఆధీనంలోనే వుందని కూడా మాకు తెలుసు."

"అదెలా తెలిసింది?" అడిగాడు డ్యూపిన్.

"స్పష్టంగా అర్థమైపోతోంది. దొంగ చేతుల్లోంచి ఆ పత్రం బయటికొస్తే జరగాల్సిన పరిణామాలు ఇంకా జరగలేదు. ఆ పరిణామాలు అతని చేతుల్లోనే వున్నాయి."

"ఇంకొంచెం వివరంగా చెప్పండి" అన్నాను.



''వెల్, ఆ పత్రం ఎవరి అధీనంలో అయితే వుంటుందో వారికి ఒకానొక స్థానంలో లేని అధికారం పుట్టుకొస్తుందని మాత్రం చెప్పగలను'' గోడమీద పిల్లివాటంగా అన్నాడు జీ.

''నాకింకా ఏం అర్థం కాలేదు'' అన్నాడు డ్యూపిన్.

''అర్థం కాలేదా? వెల్, పేరు చెప్పగూడని ఓ మూడో మనిషికి ఆ పత్రం గురించి తెలిసిందంటే అత్యున్నత స్థానంలో వున్న ఒక వ్యక్తి పరువు మర్యాదలు మంట గలిసిపోతాయి. అందువల్ల ఆ పత్రం దక్కించుకో గలిగినవారి చేతిలో ఆ అత్యున్నత స్థానంలో వున్న వ్యక్తి కీలు బొమ్మగా మారిపోయి ఆత్మగౌరవం, మనశ్శాంతి పోగొట్టుకోవలసి వస్తుంది.''

''కానీ'' మధ్యలో కలగజేసుకుంటూ అన్నాను. ''ఆ దొంగ అలాంటి అధికారం చలాయించాలంటే అతనెవరో ఆ అత్యున్నత స్థానంలో వున్న వ్యక్తికి తెలియాలి. ఆ దొంగ అలాంటి సాహసానికి...''

''ఆ దొంగ ఎలాంటి సాహసానికైనా పూనుకోగలడు'' చెప్పాడు మిస్టర్ జీ. ''అతనెవరో కాదు, మినిస్టర్ 'డీ' దొంగతనం చేయడంలో తను చూపించిన తెలివి తేటలు కూడా తక్కువేం కాదు.

''ఆ పత్రం నిజానికో వుత్తరం. ఆ అత్యున్నత స్థానంలో వున్న వ్యక్తి రాజ భవనంలో ఏకాంతంలో వుండగా ఆ వుత్తరం అందింది. అదామె చదువుతూ వుండగానే ఆ వుత్తరం చూడగూడని వ్యక్తి అక్కడికి రానే వచ్చాడు.

''ఆమె వెంటనే ఆ వుత్తరాన్ని బల్ల సొరుగులో దాచడానికి ప్రయత్నించింది. అయితే ఆదుర్దాలో అది సాధ్యం కాలేదు. దాంతో ఆమె ఆ వుత్తరాన్ని ఎలా వున్నదలాగే బల్ల మీద వదిలేయాల్సి వచ్చింది. అలా చేయడంలో ఆ వుత్తరంలోని విషయం కిందికి పోయి అడ్రసు మాత్రం పైకి కనిపిస్తోంది. అలాంటి సమయంలో అక్కడికొచ్చారు మన మినిస్టర్ డీ గారు.

''వచ్చిన వెంటనే ఆయనగారి డేగకళ్ళు ఆ వుత్తరం మీద పడ్డాయి. అడ్రసుని బట్టి ఆ చేతిరాత ఎవరిదై వుంటుందో పసిగట్ట గలిగాడు. ఆపైన ఆమె మొహంలో కనిపిస్తున్న కంగారుని బట్టి అసలు రహస్యం కని పెట్టగలిగాడు.

''కాసేపు వాళ్ళతో అదీ ఇదీ మాట్లాడాక తన జేబులోంచి ఇంచుమించు చూడ్డానికలాగే వున్న మరో వుత్తరం బయటికి తీశాడు. కాసేపా వుత్తరాన్ని చదువుతున్నట్టుగా నటించి నెమ్మదిగా దాన్ని అసలు వుత్తరం పక్కనే వుంచాడు. తర్వాత మరో పావుగంట సేపు ప్రజలకు సంబంధించిన విషయాలు వాళ్ళతో చర్చించాక చివరికి సెలవు తీసుకున్నాడు. వెళ్ళేటప్పుడు తన వుత్తరానికి బదులు తనది కాని ఆ అసలు వుత్తరాన్ని తీసి జేబులో పెట్టుకుని చక్కాపోయాడు.

''ఉత్తరం స్వంతదారు అదంతా చూస్తూనే వుంది. కానీ, అఫ్‌కోర్స్, ఆ వుత్తరం చూడగూడని వ్యక్తి తన పక్కనే నిలబడి వుండగా నోరు మెదపలేక పోయింది. ఇక మంత్రిగారు బల్లమీద వదిలిపెట్టి వెళ్ళిన వుత్తరానికి ఏ మాత్రం ప్రాముఖ్యత లేదు.''

''అదీ సంగతి'' అంతా విన్నాక సమ్మర్దించి అన్నాడు డ్యూపిన్. ''ఉత్తరం పోగొట్టుకున్న వ్యక్తికి దొంగ ఎవరో తెలిసినందువల్లే ఆమె మీద అతను పెత్తనం చలాయించడం పూర్తిగా సాధ్యపడింది'' చెప్పాడు.

''అవును,'' చెప్పాడు మిస్టర్ జీ. ''కొద్ది నెలల క్రితం అతను అధికారాన్ని ప్రమాదకరమైన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం కూడా జరిగింది. ఆమె ఆ వుత్తరాన్ని తిరిగి సాధించాల్సిన అవసరం ఏ రోజుకారోజు పెరిగిపోతుందని గుర్తించింది. అయితే, అఫ్‌కోర్స్, అందరికీ తెలిసేలా అది జరక్కూడదు. దాంతో చివరికి తెగించి ఆమె విష

యాన్ని నాతో చెప్పేసింది."

"ఇంకెవరికి చెప్పుకోగలుగుతుంది లెండి," గుప్పున పొగవదుల్తూ అన్నాడు డ్యూపిన్. "మీకంటే గొప్పవాడు లోకంలో వుండాలిగా."

"మీరు మరీ నన్ను పొగిడేస్తున్నారు" అన్నాడు జీ. "అయినా అలాంటి అభిప్రాయంతోనే నన్ను పిలిపించి వుండవచ్చనుకోండి."

"అయితే ఆ వుత్తరం ఇంకా మంత్రిగారి చేతుల్లోనే వుందన్నమాట" అన్నాను. "అది దగ్గరుంచుకోవడం వల్లనే పెత్తనం చలాయించడం ఆయనకు సాధ్యపడుతుంది. మరే విధంగానూ ఉపయోగించడం వల్లకాదు. అలా చేస్తే ఆ అధికారం కాస్తా పోతుంది. అంతేగా?"

"అవును" చెప్పాడు మిస్టర్ జీ. "ఆ ఆలోచనతోనే నేను ప్రొసీడయ్యాను. నా మొట్టమొదటి కర్తవ్యం మంత్రిగారి భవనాన్ని పూర్తిగా సోదా చేయడం. ఆయనకు తెలీకుండా అలా వెతకడంలోనే నాకు మొట్టమొదటి ఇబ్బంది కూడా ఎదురైంది. అన్నింటినీ మించి మా పథకం గురించి ఆయనకు ఏ మాత్రం అనుమానం రాకూడదు. అలా జరిగితే ప్రమాదమని నాకు ముందుగానే హెచ్చరిక అందింది."

"కానీ, ఇలాంటి పరిశోధనల్లో మీరు అందెవేసిన చెయ్యిగదా? పారిస్ పోలీసులు గతంలో ఇలాంటివి చాలా చేశారు" అన్నాను.

"అవును. అందుకే నేను నిరుత్సాహపడలేదు. మంత్రిగారి అలవాట్లు కూడా ఆ విషయంలో నాకు గొప్పగా అనుకూలించాయి. రాత్రిళ్ళు ఆయన ఎక్కువగా ఇంట్లో వుండడు. నౌకర్లు కూడా ఎక్కువమంది లేరు. మామూలుగా వాళ్ళు తమ యజమాని గదికి దూరంగా పడుకుంటారు. అందులోనూ వాళ్ళంతా ఇటాలియన్లు కాబట్టి రాత్రిళ్ళు మందుకొట్టి పడుకుంటారు. మీకు తెలుసుగా, పారిస్ నగరంలో ఏ గదినైనా, ఏ పెట్టెనైనా తెరవగల తాళం చెవులు నా దగ్గరున్నాయి. ఈ మూడు నెలలుగా నేను మంత్రిగారి భవనాన్ని స్వయంగా సోదా చేయని రాత్రంటూ లేదు. ఇది నా గౌరవానికి సంబంధించిన సమస్య. తర్వాత మీకో గొప్ప రహస్యం చెప్పనా? ఈ పనిసాధిస్తే నాకు పెద్ద ఎత్తున బహుమానం దొరుకుతుంది. అందువల్ల ఆ దొంగ నాకంటే తెలివైనవాడని నాకు పూర్తిగా నమ్మకం కుదిరేదాక సోదా చేయడం మానుకోలేదు. ఆ కాగితాన్ని దాచడానికి ఆ స్థలంలో ఎక్కడైతే అవకాశం వున్నదో అక్కడల్లా మూలమూలలా గాలించాను."

"అయితే ఆ వుత్తరాన్ని మంత్రిగారు తన అధీనంలోనే వుండేలా తనింట్లో కాక మరో చోట దాచే అవకాశం లేదా?" సజెస్టు చేశాను.

"దానికంతగా అవకాశం లేదు" చెప్పాడు డ్యూపిన్. "రాజదర్బారులో ప్రస్తుతం సాగుతున్న వ్యవహారాల్ని బట్టి—అందులోనూ ముఖ్యంగా మినిస్టర్ డీ గారు ఇరుక్కున్న కొన్ని కుంభకోణాల్ని బట్టి—కావల్సిన వెంటనే ఆయన ఆ పత్రాన్ని బయటికి తీయాల్సి వుంటుంది. ఆ పత్రాన్ని తన అధీనంలో వుంచుకోవడం ఆయనకెంత ముఖ్యమో అవసరమైన క్షణంలో ఆటంకం లేకుండా దాన్ని బయట పెట్టగలగడం కూడా అంతే ముఖ్యం."

"ఉత్తరం బయట పెట్టడంలో ఆటంకం దేనికొస్తుంది?" అడిగాను.

"అది నష్టపోతే," చెప్పాడు డ్యూపిన్.

"నిజమే. మరైతే ఆ వుత్తరం ఆ భవనంలోనే వుందన్నమాట. మంత్రిగారా వుత్తరాన్ని తన వంటి మీద దాచుకునే ప్రశ్నలేదనుకుంటాను" అన్నాను.

"ఏంత మాత్రం లేదు" చెప్పాడు మిస్టర్ జీ. "బందిపోటు దొంగల్లా దారికాచి రెండుసార్లు ఆయన్ని పట్టుకున్నాం. స్వయంగా నా ఆధ్వర్యంలో ఆ విధంగా ఆయన్ని రెండుసార్లు సోదా చేయడం జరిగింది."

"మీరంత శ్రమ తీసుకోవడం అనవసరం" చెప్పాడు డ్యూపిన్. "మిస్టర్ డీ అంత మూర్ఖుడేం కాదు. మీరావిధంగా దారి కాస్తారని ముందుగా వూహించే వుంటాడు."

"అవునవును, అంతే మూర్ఖుడేం కాదు. కాకపోతే కవిగదా— మూర్ఖత్వానికి ఒకడుగు దూరంలో మాత్రమే వున్నాడు," అన్నాడు జీ.

"నిజమే. అప్పుడప్పుడూ నేను కూడా తలాతోకాలేని కవిత్వం గిలుకుతూ వుంటాను" సుదీర్ఘంగా ఓసారి పైపు పీల్చి సాలోచనగా అన్నాడు డ్యూపిన్.

'మీరు చేసిన సోదా గురించి వివరాలు చెప్పండి' అన్నాను. నాకు బోలెడంత అనుభవం వుంది. ఒక్కోగది ఒక్కోవారం చొప్పున ఇల్లంతా గాలించాం. ప్రతి గదిలో మొదట ఫర్నిచర్ని సోదా చేశాం. సొరుగులన్నీ తెరిచాం. సరైన శిక్షణ పొందిన పోలీసు ఉద్యోగికి రహస్య అరలంటూ అడ్డురావని మీకు తెలుసనుకుంటాను. ఇలాంటి ముఖ్యమైన సోదాలో

---

## జీవితం పీడకలగా గడిపిన మహా రచయిత

# ఎడ్గార్ ఆలన్ పో

ఎడ్గార్ పో జనవరి 19, 1809న అమెరికాలో పుట్టాడు. రెండేళ్ళ వయసులో అనాథై పోయిన పోని జాన్ ఆలన్ అనే ధనికుడు పెంచుకున్నాడు. అప్పట్నుంచీ ఎడ్గార్ పో కాస్తా ఎడ్గార్ ఆలన్ పోగా మారాడు.

యూనివర్సిటీలో చదువుతుండగా పో పేకాటలో అప్పుల పాలయ్యాడు. ఆ అప్పులు తీర్చడానికి పెంపుడు తండ్రి నిరాకరించడంతో పారిపోయి సైన్యంలో చేరాడు. అప్పుడే పో తొలి కవితా సంకలనం అచ్చయింది.

పో పద్యాలకు మంచి కీర్తి రావడంతో పెంపుడు తండ్రితో రాజీ కుదిరింది. అయితే వాళ్ళిద్దరికీ మళ్ళీ బెడిసి కొట్టడానికి ఎంతోకాలం పట్టలేదు. డ్యూటీ నిర్లక్ష్యం చేశాడన్న కారణంగా పోని మిలిటరీ అకాడమీ నుంచి బయటికి పంపేశారు. ఇంతలో పెంపుడు తండ్రి మరణించాడు. వీలునామాలో పో పేరు మచ్చుకైనా లేదు. చేతిలో చిల్లికానీ లేకుండా బికారిగా మిగిలిన పో కడుపు నింపుకోవడానికి ఏదో ఒకటి చేయాల్సి వచ్చింది.

తనకున్న రచనానుభవంతో ఓ పత్రికలో సంపాదకుడిగా చేరాడు. ఆర్థికంగా కొంచెం కుదుట పడ్డాక వర్జీనియా అనే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు అప్పటికి పో వయస్సు ఇరవై ఏడేళ్ళు. అతని భార్య వయసు మాత్రం కేవలం పధ్నాలుగు సంవత్సరాలు.

తాగుడు కారణంగా తను పని చేస్తున్న పత్రిక నుంచి బయటికి నడవాల్సి వచ్చింది. తర్వాత మరో పత్రికలో చేరాడు. ఆ తర్వాత ఇంకో పత్రికలో. ఎక్కడా ఏడాది కంటే ఎక్కువ పని చేయలేకపోయాడు. పత్రికా సంపాదకుడిగా పని చేసే కాలంలో ఆ పత్రికల్ని, పో తన రచనల్తో నింపేసేవాడు. ఆయన రాసిన కథలూ, పుస్తక సమీక్షలూ, సాహిత్య విమర్శలూ ఎక్కువగా అలా అచ్చనవే.

భార్య వర్జీనియా దీర్ఘ వ్యాధితో మరణించింది. అప్పట్నుంచీ పో మరింత విచ్చలవిడిగా మారిపోయాడు. తాగుడు, జూదం, మాదక ద్రవ్యాలూ, స్త్రీలతో అక్రమ సంబంధాలూ ఎక్కువై పోయాయి. చివరికి అక్టోబరు 7, 1849న కేవలం నలభై ఏళ్ళ వయసులో పో అతిగా తాగిన స్థితిలో మరణించాడు.

పో గురించి చాలా కథలు ప్రచారంలో వున్నాయి. అతను నపుంసకుడనీ, ఆ వ్యధ భరించలేక తాగుబోతుగా మారాడనీ ఓ కథ. వయసులో తనకంటే చాలా చిన్న పిల్లని పెళ్ళాడ్డంలో రహస్యం అదేనని చెప్పేవారున్నారు. ఏది ఏమైనా పో జీవితం ఓ నిరాశకూపం అనేది నిర్వివాదాంశం.

ప్రపంచ సాహిత్య చరిత్రలో పో చిరస్థాయిగా నిలిచిపోయే మహా రచయిత. మన ఈ రోజు షార్ట్ స్టోరీ అని పిలుస్తున్న, చిన్న కథను ఆయనే సృష్టించాడు. ఆధునిక కథ ఆ విధంగా పోకు చాలా ఋణపడింది. డిటెక్టివ్ కథ కూడా ఆయన సృష్టించిందే. పో తర్వాత డిటెక్టివ్ కథని ఆకాశానికెత్తిన ఆర్థర్ కానన్ డాయల్, అగథా క్రిస్టీ వంటి రచయితలు పో పద్ధతిలోనే కథ చెప్పారు. అదే పద్ధతి ఈనాటికీ కొనసాగుతోంది.

— దాదా హయాత్.

"అదెందుకు?"

"ఏదైనా వస్తువు దాచాలనుకునేవాళ్ళు ఒక్కోసారి బల్లల టాపులు తీసేసి కోడులో రంధ్రం చేస్తారు. తర్వాత దాచాలనుకున్న వస్తువుని అందులో పెట్టేసి టాపు మూసేస్తారు. మంచం కోళ్ళ విషయంలో కూడా అలాగే చేయడం జరుగుతూ వుంటుంది."

"బోలుగా వున్న చోట తట్టి చూస్తే తెలిసిపోదూ?"

"వస్తువుని దూదిలో చుట్టి దాస్తే శబ్దం రాదు. అదీకాక చప్పుడు కాకుండా సోదా చెయ్యాలనేది మా తాపత్రయం."

"కానీ, మీరు చెప్పిన విధంగా ఆ వుత్తరం దాచగల చోటల్లా వెతకడానికి ఫర్నిచరంతా ముక్కలు చేయలేరు గదా! ఉదాహరణకు ఆ వుత్తరాన్ని దబ్బనమంత సైజులో చుట్టి కుర్చీ నిలువు బారుల్లోకి తోసేయవచ్చు. కొంపదీసి మీరు ఫర్నిచరంతా విప్పి చూడ లేదు గదా?"

"లేదు. అంతకంటే మంచిపనే చేశాం. ప్రతి కుర్చీ నిలువు బారుల్నీ, ఆ మాటకొస్తే ప్రతి సామాను జాయింట్లనీ శక్తివంతమైన భూతద్దంతో పరిశీలించాం. వాటిలో కొత్తగా ఏ మార్పులు చేర్పులున్నా మేము వెంటనే కనుక్కోలేకపోవడమనే ప్రశ్నేలేదు. ఉదాహరణకు ఆవగింజంత దుమ్ముకూడా తాటికాయంత పెద్దదిగా కనిపించేది. బంక పెట్టడంలో ఏ మాత్రం పొరపాట్లున్నా, జాయింట్ల సందులు ఏ మాత్రం అసాధారణంగా కనిపించినా మేము పట్టేసివాళ్ళం."

"అయితే మీరు అద్దాలకూ పోర్డుబోర్డుకీ మధ్య ఖాళీ జాగాలో కూడా చూశారనుకుంటాను. అలాగే పరుపులూ దుప్పట్లూ, ఇంకా కర్టెన్లూ తివాచీలు కూడా చూసే వుంటారు."

"అఫ్‌కోర్స్. ఇంటి సామాను అణువణువూ సోదా చేశాక ఇంటినే ఓ పట్టు పట్టాం. ఇంటి స్థలమంతా కొన్ని భాగాలుగా విభజించి ఏదీ మిస్ కాకుండా నెంబర్లు వేశాం. తర్వాత ఇందాక చెప్పిన భూతద్దంతో అంగుళం అంగుళం చొప్పున పరీక్షించాం. ఆ భవనానికి ఆనుకునే వున్న రెండిళ్ళని కూడా అదే విధంగా సోదా చేశాం."

"పక్కిళ్ళో!" అరిచాను. "మీకు చాలా శ్రమ కలిగి వుండాలే."

"శ్రమే మరి. కానీ, వచ్చే బహుమానం కూడా గొప్పదేగా."

రహస్య అరల్ని దృష్టినుంచి తప్పించుకుపోనిచ్చేవాడు శుద్ధ దద్దమ్మ. ప్రతి బీరువాలో గమనించాల్సిన సందులు కొన్ని వుండడం చాలా మామూలు విషయం. అలాంటి విషయాల్లో మాకు ఖచ్చితమైన సూత్రాలున్నాయి. సందులో నూరోవంతు కూడా మా దృష్టి నుంచి దాటిపోలేదు. బీరువాల పనయ్యాక మేము కుర్చీలు తీసుకున్నాం. పొడుగ్గా సన్నగా వుండే సూదుల్తో కుషన్లు పరీక్షించాం. తర్వాత బల్లల టాపుల్లేశాం."



## జీవించిన కొత్త జంట

'సౌదాగర్' చిత్రంలో నటించేందుకు పెద్ద పెద్ద నటులు, నటీమణులు నటించేందుకు పోటీపడ్డారు. కాని, నాయకీ, నాయకుల పాత్రలకు నూతన తారలను ఎంపిక చేయాలని భావించి వివేక్ మిశ్రణ్, మనీషా కోయిరాలా జంటను తీసుకున్నాం. ఇద్దరూ కొత్తవారైనప్పటికీ ఆ పాత్రలకు జీవం పోశారు. 'సౌదాగర్' చిత్ర నిర్మాణ సమయంలో ప్రధాన భాగాలన్నీ పోటీపడ్డాయి.— అంటున్నాడు షోమాన్ సుభాష్ ఘయాయ్.

"ఇళ్ళ కాంపౌండుని కూడా కలిపే చూశారా?"

"ఆ నేలంతా ఇటుకల్తో తాపడం చేశారు. అందువల్ల మాకు శ్రమ కలగలేదక్కడ. ఇటుకల మధ్య ఖాళీ సందుల్లో పెరిగిన గడ్డిని పరీక్ష చేశాం. అక్కడేం చెక్కు చెదర్లేదు."

"అయితే మంత్రిగారి కాగితాలు కూడా పరీక్షించే వుంటారు. లైబ్రరీలో పుస్తకాన్ని కూడా చూశారా?"

"ఖచ్చితంగా చూశాం. ప్రతి ప్యాకేజీని పార్సిల్‌నీ విప్పాం. అలాగే ప్రతి పుస్తకాన్నీ విప్పి చూడ్డమే కాదు, ఓసారి దులపరించడంతో తృప్తి పడకుండా ప్రతి పేజీ తిరగేశాం. పుస్తకాల అట్టల మందం కూడా ఖచ్చితమైన కొలమానం ప్రకారం కొలిచాం. భూతద్దంలో కూడా అతి జాగ్రత్తగా పరిశీలించాం. బైండింగుల్లో ఇటీవల ఏవైనా మార్పులు జరిగివుంటే మా దృష్టి దాటిపోవడం అసాధ్యం. బైండర్ దగ్గర్నుంచి అప్పుడే బైండింగై వచ్చిన అయిదారు పుస్తకాల్ని, సూదుల్తో పరీక్షించాం."

"తివాచీల కింది నేల కూడా పరీక్షించారా?"

"నిస్సందేహంగా. తివాచీలన్నీ తీసి నేలని భూతద్దంతో పరీక్షించాం."

"మరి వాల్ పేపర్లో?"

"అవి కూడా."

"నేల మాళిగలు?"

"చూశాం."

"అయితే మీరు పప్పులో కాలేసినట్టే. ఉత్తరం మీరన్నట్టు ఆ ఇలాకాలో లేదు," అన్నాను.

"ఆ మాటే నిజం కావచ్చని నేనూ భయపడుతూనే వున్నాను. ఇప్పుడు చెప్పండి డ్యూపిన్. నన్నేం చెయ్యమంటారు?" అన్నాడు జీ.

"ఆ ప్రదేశాన్ని జాగ్రత్తగా వెతకడమే," చెప్పాడు డ్యూపిన్.

"ఇంకే మాత్రం ఆ అవసరం లేదు. ఆ వుత్తరం ఆ బంగళాలో లేదన్నది నేనిప్పుడు వూపిరి పీలుస్తున్నంత నిజం" అన్నాడు మిస్టర్ జీ.

"అంతకంటే నేను చెప్పగలిగింది ఇంకేం లేదు" చెప్పాడు డ్యూపిన్. "అన్నట్టు ఆ వుత్తరం ఎలా వుంటుందో ఆ వివరాలు మీ దగ్గరున్నాయి కదూ?"

"ఆహా, వున్నాయి" అంటూ ఓ పాకెట్ బుక్కు బయటికి తీసి ఆ వుత్తరం రూపు రేఖల గురించి చదవడం మొదలెట్టాడు మిస్టర్ జీ. దాని తలాతోకా, లోపలా బయటా అంతా ఎలా వుంటుందో వివరంగా తెలియజేశాక మా దగ్గర్నుంచి సెలవు తీసుకున్నాడు. ఆ పెద్దమనిషి అంత నిరాశగా కనిపించడం నేనెప్పుడూ చూడలేదు.

దాదాపు నెల రోజుల తర్వాత ఆయన మళ్ళీ మమ్మల్ని కలుసుకున్నాడు. మేము కూడా మునుపట్లాగే అదే గదిలో ఇంచుమించు అదే స్థితిలో కూర్చొని వున్నాం. వస్తూనే ఆయన కూడా ఓ పైపూ, కుర్చీ అందుకుని ఏదో పిచ్చాపాటి మాట్లాడ్డం మొదలెట్టాడు. కాసేపటి తర్వాత నేనడిగాను—

"ఇంతకీ ఆ వుత్తరం సంగతేమైంది? మంత్రిగారికి టోకరా ఇవ్వడం కుదిరే పనికాదని చివరికి ఖాయం చేసుకున్నారు కాబోలు."

"వాడి దుంపతెగ! నిజమేనండీ. డ్యూపిన్ చెప్పినట్టే ఆ ఇల్లు నేను మళ్ళీ సోదా చేశాను. కానీ, పడ్డ శ్రమంతా వృధా అయిపోయింది. అలా జరుగుతుందని నాకు ముందే తెలుసు."

'మీ కొస్తుందన్న బహుమానంఎంతన్నారు?' అడిగాడు డ్యూపిన్.

"ఎందుకూ? చాలా పెద్ద బహుమానమే. ఎంతో చెప్పడం నాకిష్టం లేదు. అయితే ఒక్కటి మాత్రం చెప్తాను— ఆ వుత్తరం నాకు సంపాయించి పెట్టగల వారికి నేను యాభై వేల ఫ్రాంకులకి పర్సనల్ చెక్కు రాసివ్వగలను. అసలు సంగతేమిటంటే ఆ వుత్తరాన్ని సంపాయించాల్సిన అవసరం రోజు రోజుకీ పెరిగిపోతోందని దానికిచ్చే బహుమానం ఇటీవలే రెట్టింపు చేయడం జరిగింది. బహుమానం మూడింతలైనా అంతకంటే నేను చెయ్యగలిగిందే లేదు."

"సర్లెండి, నిజానికి మీరు చెయ్యాల్సిందంతా చెయ్యలేదని నా అభిప్రాయం. మీరు చెయ్యగలిగింది ఇంకొంచెం మిగిలి పోయింది" తాపీగా పైపు పీలుస్తూ నిదానంగా అన్నాడు డ్యూపిన్.

(ముగింపు వచ్చేవారం)